
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
3
మంగళవారం 21 మే 2024
జిల్లాల వార్తలు




హనుమాన్‌నగర్ కేంద్రంలో కూలీలు లేక వడ్లు దించుతున్న రైతులు



సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని గోదాం వద్ద అన్‌లోడింగ్ కోసం వరుసలో ఉన్న లారీలు

# ఎక్కడి వడ్లు అక్కడే..

## కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన నిల్వలు

### హమలీల కొరతతో నిలిచిన తరలింపు
### మిల్లులు, గోదాంల వద్ద లారీల నిరీక్షణ
### 52,244 మెట్రిక్ టన్నుల సేకరణ

సంగారెడ్డి టౌన్, మే 20 : ఓవైపు వెంటాడుతున్న వర్షం.. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో జాప్యం.. వెరసి అన్నదాతల అగచాట్లు ఇంతాఅంత కాదు..! ఆరుగాలం కష్టపడి పండించిన పంట కల్లాల్లోనే మొలకలు వస్తుంటే ఏం చేయాలో తెలియక బావురుమంటున్నారు. ప్రతీ గింజను కొంటామని చెప్పిన ప్రభుత్వం.. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న అకాలవర్షాలకు ఆరబోసిన వడ్లు ఎక్కడికక్కడ తడిసిపోతున్నాయి. వడ్లు ఇలా ఆరబోయగానే.. అలా వర్షం ప్రత్యక్షమవుతున్నది. ఎండిన వడ్లు మళ్లీ మళ్లీ తడిసిపోయి రంగు మారుతున్నాయి. కొన్నిచోట్ల మొలకలు వస్తున్నాయి.

**హమాలీల కొరత**

సంగారెడ్డి జిల్లాలో హమాలీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. మిల్లులు, గోదాముల వద్ద లారీలు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. తూకం వేసిన వడ్లనే మిల్లులకు తీసుకువెళ్లే పరిస్థితి లేకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు కొత్తగా వడ్లను తీసుకోవడం లేదు. దీంతో రైతులు కేంద్రాలకు వడ్లను చేర్చి రోజులు.. వారాల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది. హమాలీలు అందుబాటులో లేకపోవడంతో కొన్నిప్రాంతాల్లో రైతులే తాము తెచ్చిన ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేసి తూకం వేస్తున్నారు. జిల్లాలోని అనేక కేంద్రాల్లో బీహార్, అసోం, జార్ఖండ్ మహారాష్ట్రలకు చెందిన హమాలీలు పనిచేస్తుంటారు. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సొంత రాష్ట్రాలకు వెళ్లినవారు రాకపోవడంతో ఇక్కడ హమాలీల కొరత ఏర్పడిందని కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. హమాలీలకు లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తే క్వింటాలుకు రూ.40లు చెల్లిస్తున్నారు. ఇదికాకుండా రైతుల నుంచి క్వింటాలకు రూ.10 వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల కోసం తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో పదిహేను రోజులుగా మిల్లులకు ధాన్యం పంపేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్ని కేంద్రాల వద్ద లోకల్ కూలీలు అందుబాటులో ఉన్నా ఎక్కువ మొత్తం డిమాండ్ చేస్తున్నారు.

**మిల్లుల వద్ద నిరీక్షణ**

మిల్లుల వద్ద అన్‌లోడింగ్ చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్లిన లారీలు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. జిల్లాలో మొత్తం 26 రైస్‌మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. నారాయణఖేడ్, హత్నూర, న్యాల్‌కల్, జిన్నారం, మనూరు, పుల్కల్, నిజాంపేట, వట్‌పల్లి, కల్హేర్, కంగ్టి, పటాన్‌చెరు, కంది తదితర మండలాల పరిధిలోని ఉన్న మిల్లులకు ధాన్యం తరలించాలని సివిల్‌సప్లయ్ శాఖ నిర్ణయించింది. హమాలీల కొరతకు తోడు సరిపడా లారీలు లేకపోవడంతో రోజుకు నాలుగు లోడ్ల వడ్లు తరలించాల్సిన చోట రెండు లోడ్లు కూడా తీసుకువెళ్లడం లేదు

**దిగుబడి అంచనా 1.96 లక్షల మెట్రిక్ టన్నులు**

జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 52244 మెట్రిక్ టన్నుల దాన్యం సేకరించారు. ఏప్రిల్ మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా 211 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 101, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 94, డీసీఎంఎస్‌ల ద్వారా 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 8,976 మంది రైతుల నుంచి 52,244 మెట్రిక్ టన్నుల దాన్యం సేకరించారు. జిల్లావ్యాప్తంగా లక్షా 96వేల 219 మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడి రావచ్చని అంచనా వేశారు. ఈ సారి వరి పంటకు తెగుళ్లు, ఇతర కారణాల వల్ల దిగుబడి తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 52244 మెట్రిక్ టన్నుల దాన్యం సేకరించగా 49,368 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించారు.

**చెల్లింపులూ ఆలస్యమే..**

ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లింపులు కూడా సకాలంలో జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని సర్కారు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.119.09 కోట్ల విలువైన 52,244 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇప్పటి వరకు 42,250 మెట్రిక్ టన్నులకు సంబంధించిన వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందులో 4,018 మంది రైతులకు 23,191 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.51.09 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగిలిన రైతులు డబ్బుల కోసం నిరీక్షిస్తున్నారు.

రూ. పది వేలు ఇస్తామన్నా

## లారీలు రావడం లేదు

కొల్చారం, మే 20 : లారీకి రూ. 10 వేలు అదనంగా ఇస్తామన్నా ధాన్యం తీసుకువెళ్లేందుకు రావడం లేదు.. ఊర్లో పది శాతం ధాన్యం కూడా తూకం వేయలేదు.. వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తున్నా పట్టించుకునేవారు లేరు... అని కొల్చారం మండలంలోని పైతర, కోనాపూర్ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పక్కనే మంజీరానది ప్రవహిస్తుండడం.. రెండు గ్రామాల్లోనూ చెక్‌డ్యాంలు ఉండటంతో ఈ యాసంగిలో రైతులంతా వరి సాగు చేశారు. రెండు గ్రామాల్లో కలిపి 1.50 లక్షల బస్తాల ధాన్యం పండుతుందని అంచనా. రంగంపేట సొసైటీ పరిధిలో ఉన్న ఈ రెండు గ్రామాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతున్న రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 80వేల బస్తాల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 10వేల బస్తాలు కూడా సేకరించలేదని పైతర గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. కోనాపూర్‌లో సగం వరి కోతలు మాత్రమే పూర్తయ్యాయి. అకాల వర్షాలతో ధాన్యం రాశులు కల్లాల్లోనే ఉండిపోయాయి. మొలకలు రావడంతో రాశికి పది బస్తాల నుంచి ఇరవై బస్తాల వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్లు రంగు మారడంతో కొంటారో? లేదో అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు తూకంవేసిన వడ్లను మిల్లులకు తరలించేందుకు కూడా లారీలు రావడం లేదని ఆరోపిస్తున్నారు.



**లారీలు రావడం లేదు**



పైతర గ్రామానికి లారీలు అసలే రావడం లేదు. వడ్ల కుప్పలు కల్లాల్లోనే ఉన్నాయి. వర్షాలు కొనసాగితే పొలాల్లోకి లారీలు పోలేవు. వీలైనంత త్వరగా వడ్లు కొనుగోలుచేసి లారీలు పంపించి తరలించాలి.

-కుసంగి శేఖమ్మ, పైతర

**లంచం ఇస్తేనే లారీలు వస్తున్నాయి**



అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వస్తుండడంతో లారీల వాళ్లు అదనంగా డబ్బులు అడుగుతున్నారు. ఒక్కో లోడ్‌కు రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు వసూలు చేస్తున్నారు. అయినా లారీలు తక్కువగా ఉండి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అందరి వద్దకు లారీలు రావడం లేదు.

-పుట్టి కృష్ణ, పైతర

పైతరలో మొలకలు వస్తున్న ధాన్యం

## కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించండి

**మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి**


సమీక్షలో మాట్లాడుతున్న భారతి హోళికేరి

మెదక్, మే 20 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ధాన్యం సేకరణ, ఎదురవుతున్న ఇబ్బందులపై కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎగుమతి చేయడానికి మిల్లింగ్ సామర్థ్యాన్ని సరిచూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని మిల్లులకు ధాన్యాన్ని ఎగుమతి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆర్డీవోలు, తహసీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**టార్పాలిన్లు ఏర్పాటు చేయండి**

రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా అవగాహన కల్పించాలని అధికారులకు భారతి హోళికేరి సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేయాలని సూచించారు. తడసిన ధాన్యాన్ని పారాబాయిల్డ్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం దిగుమతికి లారీల కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ఎంత ఉంది, ఇంకా కేంద్రాలకు రైతులవద్ద నుంచి రావాల్సిన ధాన్యం పూర్తి వివరాలతో సమగ్ర నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి సందేహాలు వద్దని, ప్రతీ రైతు నుంచి ధాన్యాన్ని సేకరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు రమాదేవి, శ్రీనివాస్, జయచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, డీసీవో కరుణ, తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.



## 'పెద్దచెరువు' సమస్య తీరుస్తాం

బాధితులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**త్వరలో ఉన్నతస్థాయి సమావేశం : మంత్రి శ్రీధర్‌బాబు**

పటాన్‌చెరు, మే 20: అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపుకాలనీల సంయుక్త కార్యాచరణ కమిటీ సభ్యులు సోమవారం మంత్రిని హైదరాబాద్‌లో కలిసి సమస్యను వివరించారు. చెరువు నీటిని తూముల ద్వారా కిందికి వదలకుండా ఏళ్ల తరబడి కట్టడి చేయడంతో ఎఫ్‌టీఎల్ పరిధి పెరిగి ఇళ స్థలాలు నీట మునిగిపోయాయని మంత్రికి వివరించారు. అనేక కాలనీల పరిధిలోని 5వేల ప్లాట్లు నీటిలో మునగడంతో అనేక కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ సుజత తదితరులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రెండురోజుల్లో పూర్తి రికార్డులతో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రిని కలిసినవారిలో సత్యం, బ్రహ్మానందం, విజయ్‌కుమార్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, వెకంటేశ్వరావు, సాయిబాబు, శేషసాయి, రఘురాం, బాలజీ, ఎంఎస్.బాబు తదితరులు ఉన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## 'ధరణి' సమస్యలపై దృష్టిసారించాలి

**మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్ అర్బన్, మే 20: ధరణి పోర్టల్‌లో సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ, ధరణి, ప్రజావాణి పెండింగ్ సమస్యలపై సోమవారం ఆయన తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితిపై సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్ స్థాయిలో ఆన్‌లైన్ లాగిన్, పాస్‌వర్డ్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. పెండింగ్ అర్జీలను జూన్ 7లోపు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, శ్రీనివాసులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

**సంగారెడ్డిలో 7, జహీరాబాద్‌లో 3 కేంద్రాలు**

**హాజరుకానున్న 3,205 మంది విద్యార్థులు**

**నిమిషం ఆలస్యమైతే ఇంటికే**

సంగారెడ్డి అర్బన్, మే 20 : జిల్లాలో ఈ నెల 24 న నిర్వహించనున్న పాలిసెట్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, జహీరాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలో 7 పరీక్ష కేంద్రాల్లో 2,420 మంది, జహీరాబాద్‌లో 3 కేంద్రాల్లో 785 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1.30 వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు 9.30 వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 10 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తామని వెల్లడించారు. 11గంటల తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుతించబోమని స్పష్టం చేశారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని వెల్లడించారు.

ఏడుపాయల హుండీ

## 70 రోజుల ఆదాయం రూ.45.50 లక్షలు

పాపన్నపేట, మే 20 : ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయ హుండీ ఆదాయం రూ.45,50,681 వచ్చినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి వెల్లడించారు. 70 రోజుల హుండీని సోమవారం రాజరాజేశ్వరి సేవాసమితి అధ్వర్యంలో గోకుల్‌షెడ్‌లో లెక్కించారు. నగదుతో పాటు బంగారం, వెంగి మిశ్రమం, ఆభరణాలు కానుకగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాదయ్య సాయిలు, భాగారెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, యాదగిరి పాల్గొన్నారు.


ఏడుపాయలలో హుండీని లెక్కిస్తున్న మహిళలు

## జిల్లా విద్యాశాఖ బడ్జెట్ రూ.92.28 కోట్లు

- ఈ విద్యా సంవత్సరానికి వార్షిక ప్రణాళిక రూపకల్పన
- ఆమోదం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు


సంగారెడ్డిలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, మే 20 : సంగారెడ్డి జిల్లా పాఠశాల విద్యాశాఖకు 2024-25 సంవత్సరానికి సంబంధించి వివిధ అవసరాల నిమిత్తం రూ.92 కోట్లు అవసరమవుతాయని విద్యాశాఖ అంచనా వేసింది. పాఠశాలల్లో వసతుల కల్పన, నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ఈ మేరకు వార్షిక బడ్జెట్ ప్రణాళికలను రూపొందించి, ఆ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వ ఆమోదం లభిస్తే ఈ ఏడాదికి సంబంధించిన నిధులు విడుదలవుతాయని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ప్రతిపాదించిన బడ్జెట్‌లో యాక్సిస్ అండ్ రెంటెన్షన్ కోసం రూ.33.5 లక్షలు, జెండర్ అండ్ ఈక్విటీ కోసం రూ.42.51 కోట్లు, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ కోసం రూ.87.11 లక్షలు, మానిటరింగ్ ఆఫ్ ది స్కీమ్ కింద రూ.15.92 లక్షలు, ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కోసం రూ.32.6 లక్షలు, క్వాలిటీ కోసం రూ.26.82 కోట్లు, ఆర్‌టీఈ ఎన్‌టైటిల్‌మెంట్స్ కోసం రూ.11.50 కోట్లు, స్కిల్ ఎడ్యుకేషన్ కోసం రూ.24.7 లక్షలు, స్పోర్ట్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నిమిత్తం రూ.13.1 లక్షలు ఇలా మొత్తం రూ.92 కోట్ల 28 లక్షల 53 వేలు అవసరమని ప్రతిపాదించారు. ఇందులో డిజిటల్ విద్య, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, స్కూల్ గ్రాంట్స్, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే ఇన్నోవేషన్ కార్యక్రమాలు, వృత్తి విద్య, శిక్షణల కోసం అధిక నిధులు ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా వార్షిక ప్రణాళిక రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించామని ఆ శాఖ అధికారులు తెలిపారు.

**కస్తూర్బాలకు నిధుల విడుదల**

సంగారెడ్డి అర్బన్, మే 20 : సంగారెడ్డి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు సంబంధించి నిర్వహణ నిధులు విడుదలయ్యాయి. ఈ విద్యా సంవత్సరం ఏప్రిల్ నెలకు సంబంధించిన నిధులను విడుదల చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 17 కేజీబీవీలు, 1-యూఆర్ఎస్, 1-టీఎస్ఎంఎస్ గర్ల్స్ హాస్టల్‌ల నిర్వహణకు రూ.26,66,459 మంజూరయ్యాయి. దీంతో, ఆయా ఛార్జీల విడుదల కోసం ఎదురుచూస్తున్న కేజీబీవీ ప్రత్యేకాధికారులకు ఉపశమనం లభించింది. ప్రభుత్వం ప్రతి నెలా సకాలంలో నిర్వహణ నిధులు విడుదల చేయాలని కేజీబీవీ ప్రత్యేకాధికారులు కోరుతున్నారు.

## కిసాన్ సమ్మాన్ కొందరికే..!

- మెదక్ జిల్లాలో తగ్గిన 48 వేల మంది రైతులు
- కొత్తగా భూమి కొన్నవారికి ఐదేళ్లుగా ఎదురుచూపులు

మెదక్, మే 20: రైతులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజనలో లబ్ధిదారుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతున్నది. 2019 ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీగా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. తెల్లరేషన్‌కార్డు కలిగి భూమి ఉన్న ప్రతీ రైతుకు సంవత్సరానికి రూ.6 వేలు మూడు విడతల్లో ఖాతాల్లో జమచేస్తున్నది.

**జిల్లాలో లబ్ధిదారులు 1,43,133**

మెదక్ జిల్లాలో 2,16,000 రైతులు ఉన్నప్పటికీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన మాత్రం 1,43,133 మందికే అందుతున్నది. కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనల కారణంగా మిగిలినవారు పథకానికి అర్హత సాధించలేదు. ఐదెకరాల లోపు భూమి ఉన్నవారికే సాయం అందజేస్తున్నారు. ఈ పథకంలో నూతనంగా చేరే రైతులు ఈ-కేవైసీ చేసుకుని ఉండాలని నిబంధన విధించడంతో అవగాహన లేకచాలామంది రైతులకు సాయం అందడం లేదు.

**ఐదేళ్ల క్రితం గుర్తించినవారికే..**

పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన జాబితాలో 2019 తర్వాత భూములు కొనుగోలు చేసిన, వారసత్వంగా సంక్రమించిన వారి పేర్లు నమోదు చేయడంలేదు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆదేశాలు జారీచేసి సవరణలకు అవకాశం ఇస్తే తప్ప కొత్త పేర్లు నమోదు చేసే అవకాశం లేదని జిల్లా అధికారులు స్పష్టం చేస్తున్నారు. రేషన్‌కార్డుల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. అనుకోకుండా రైతు చనిపోయినా అతని స్థానంలో మరో కుటుంబ సభ్యుడి పేరు చేర్చడానికి అనుమతించడం లేదు. బ్యాంకు ఖాతాలకు, ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం లేకపోవడంతో కూడా పలువురు అర్హులైన రైతులకు అకౌంట్లలో డబ్బులు పడడం లేదు. ఆదాయ పన్ను చెల్లించే రైతులను కూడా పథకం నుంచి తొలగించారు. రూ. 10వేల కంటే ఎక్కువ పెన్షన్ తీసుకుంటున్నవారికీ పథకం వర్తింపజేయడం లేదు. దీంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయింది. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక నిషేధిత జాబితాలో చేరిన భూమి యజమానులు, పేర్లు మార్పిడి చేసుకున్న రైతుల పేర్లను ఈ పథకం నుంచి తొలగించారు.

**ఐదేళ్లలో 47,933కి కోత**

2019 సంవత్సరంలో కిసాన్ సమ్మాన్ నిధి తొలి విడతలో 1,43,133 మంది రైతులకు రూ.28.62 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. రెండో విడతలో 1,41,748 మంది, మూడో విడతలో 1,40,479 మంది, నాలుగో విడతలో 1,39,328 మంది, ఐదో విడతలో 1,38,313 మంది, ఆరో విడతలో 1,37,190 మంది, ఏడో విడతలో 1,35,401 మంది, ఎనిమిదో విడతలో 1,34,001 మంది, తొమ్మిదో విడతలో 1,32,987 మంది, పదో విడతలో 1,31,699 మంది, పదకొండో విడతలో 1,28,801 మంది, పన్నెండో విడతలో 1,22,201 మంది, పదమూడో విడతలో 1,13,872 మంది, పద్నాలుగో విడతలె 1,,05,772 మంది, పదిహేనో విడతలో 81,946 మంది, పదహారో విడతలో 95,200 మంది రైతులకు మొత్తం రూ.404.4142 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. గత ఐదేళ్లలో 47,933 మంది రైతులు తగ్గిపోయారు.

**కేంద్రం అనుమతిస్తే కొత్త రైతుల నమోదు**

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనలో కొత్త రైతులను చేర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతిరావాలి. ప్రస్తుతం రైతుల నుంచి వినతులు స్వీకరించి, దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. కేంద్రం అనుమతిస్తే కొత్త రైతులను జాబితాలో నమోదు చేస్తాం.

-గోవింద్,
జిల్లా వ్యవసాయాధికారి, మెదక్

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

కంగ్టి, మే 20: మండల పరిధిలోని భీంరా, నాగూర్, గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను, నర్సరీలను సోమవారం ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. రాళ్ల ఏరివేత, కట్టలు పేర్చడంపై కూలీలకు అవగాహన కల్పించారు. నర్సరీలు, వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ సంజీవ్, కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్

చేర్యాల, మే 20: చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలసంఖ్య మరింత పెంపొందించాలని సిద్దిపేట డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసవాల సంఖ్యపై ఆరాతీశారు. లేబర్ రూమ్ పరిశీలించి బాలింతలతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. ల్యాబ్, ఐసీటీసీ సెంటర్, పీపీపీ యూనిట్ విభాగం, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలుపొందిన రోగుల రికార్డులను పరిశీలించారు. కుక్కకాటు, పాముకాటు మందులతో పాటు అన్నిరకాల వైద్యసేవలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉండేలా చర్యలుతీసుకోవాలని వైద్యులకు సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వినోద్ బాబ్జీ, ఆస్పత్రి వైద్యాధికారి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు సూచనలిస్తున్న పుట్ల శ్రీనివాస్





## వెంకట్రామారెడ్డి గెలుపు ఖాయం

● పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య


విలేకరులతో మాట్లాడుతున్న భూమయ్య

జగదేవ్‌పూర్, మే 20: బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య ధీమా వ్యక్తం చేశారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధితో పాటు రైతులకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. ఇతర పార్టీల నేతలు ఎన్ని విమర్శలు చేసినా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ముందు పని చేయవన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు మంచి పట్టుందని, వెంకట్రామారెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, హనుమాద్రి, ఈశ్వర్, మల్లారెడ్డి, కొత్త ఐలయ్య, మేకల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపల్లిలో జొన్నల కేంద్రం ప్రారంభం

కల్హేర్, మే 20: మండలంలోని దేవునిపల్లిలో సోమవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బాచేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ కేంద్రంలో క్వింటాల్ జొన్నలకు ప్రభుత్వం రూ.3,480 మద్దతు ధర చెల్లిస్తుందని బాచెపల్లి పీఏసీఎస్ సీఈవో విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు సంగమేశ్వర్, దేవిసింగ్ ఉన్నారు.





## సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

● రైతు ఆగ్రోస్‌లో 473 జీలుగ బస్తాలు


తూప్రాన్‌లో పచ్చిరొట్ట విత్తనాల విక్రయాలు ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారి

తూప్రాన్, మే 20: తూప్రాన్ పట్టణంలోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు తెలిపారు. సోమవారం తూప్రాన్ రైతు ఆగ్రోస్ కేంద్రంలో పచ్చిరొట్ట జీలుగా బస్తాల విక్రయం ప్రారంభించారు. తూప్రాన్ ఆగ్రోస్ కేంద్రంలో 473 జీలుగా బస్తాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. రూ. 2,790 విలువైన జీలుగా బస్తాను సబ్సిడీపై రూ. 1,116లకు అందజేస్తున్నట్లు వివరించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొచ్చి సబ్సిడీ విత్తనాలు తీసుకెళ్లాలని ఏఈ గంగుమల్లు సూచించారు. ఏఈఓ సింధు, ఆగ్రోస్ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

జహీరాబాద్, మే 20: ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు సబ్సిడీపై (జనుము, జీలుగ) పచ్చిరొట్ట విత్తనాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ ఏఈవో ప్రదీప్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ విత్తనాలు పూర్తిధర రూ. 9,050 కాగా సబ్సిడీపోను రూ.3,620కిగాను 40కిలోల బస్తాను అందిస్తున్నామన్నారు.



## బోరంచ జాతరకు ప్రత్యేక బస్సులు నడపాలి

నారాయణఖేడ్, మే 20: మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ జాతర కోసం ఆర్టీసీ సంస్థ ఖేడ్ - బోరంచల మధ్య ప్రత్యేక బస్సులను నడపాలని భక్తులు కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఏడుపాయల జాతర తరువాత అంతటి పెద్దజాతర బోరంచలో జరుగుతుంది. ఏడువారాల పాటు ప్రతీ గురువారం జాతర కొనసాగుతుండగా గత గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ల నుంచి సైతం భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఆరు నెలల క్రితం రోడ్డును నిర్మించినా బస్సు సదుపాయం కల్పించక పోవడంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపించాలని భక్తులు కోరుకుంటున్నారు.





## కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర: ఏడీఏ


కేరూర్‌లో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

వట్‌పల్లి, మే 20: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఖాదీరాబాద్, కేరూర్, బిజిలీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. వెంట ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంకుఖాతా వివరాలను కొనుగోలు కేంద్రంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో మహేష్ చౌహాన్, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, ఏఈవో భాగేష్, సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మపల్లిలో పాకలోనే పశువులు



చెట్ల కింద కట్టేసిన పాడి గేదెలు



అనారోగ్యం బారిన పడిన పశువులకు వైద్యం అందిస్తున్న పశుమిత్ర(ఫైల్)

# ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..!

## పశువుల కొట్టాలపై నిర్లక్ష్యమేలా?

- ఆర్థిక స్థోమతలేని పశుపోషకులను ఆదుకోని ఉపాధిహామీ
- అనారోగ్యం బారిన పడుతున్న పశువులు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

మద్దూరు, మే 20: వ్యవసాయం తర్వాత మిగతా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల కంటే పాడికి మంచి గుర్తింపు ఉంది. పాడి పరిశ్రమలో చాలామంది రైతులు ఉపాధి పొందుతున్నారు. వాటిలో మేటిగా నమ్మకమైన ఆదాయ వనరుగా స్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంది పాడి పరిశ్రమ. దీనిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న చిన్న, సన్నకారు రైతులు ఆర్థిక స్థోమత లేక పశువుల కొట్టాలు నిర్మించుకోకుండా చెట్లకింద, రేకుల కింద పశువులను కట్టేస్తున్నారు. దీంతో అవి ఎండకు, వానకు తట్టుకుని అనారోగ్యం బారినపడుతున్నాయి. గతంలో రైతులే స్వయంగా పశువుల రక్షణ కోసం కొట్టాలు నిర్మించుకుని అందులో వ్యవసాయ పరికరాలతో పాటు ఎరువులను దాచుకునేవారు. పంట కోతలను కొట్టాల ముందుకు తరలించి అక్కడే పశువులతో బంతి కట్టేవారు. వచ్చిన ధాన్యాన్ని కొట్టంలోనే భద్రంగా దాచుకుని వ్యాపారులకు విక్రయించేవారు. రానురాను పశువుల కొట్టాలు కనుమరుగయ్యాయి. చెట్ల కింద, రేకుల కింద పశువులకు నీడ కల్పిస్తూ వస్తున్నారు. ఉపాధిహామీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా పశువుల షెడ్లు చిన్న, సన్నకారు పాడి రైతుల దరిచేరడం లేదన్న ఆరోపణలున్నాయి. మద్దూరు, దూళిమిట్ట మండలాల్లో మొత్తం సుమారు 8వేల పశువులున్నాయి. లద్నూరు, మద్దూరు, సలాఖ్‌పూర్, బైరాన్‌పల్లి గ్రామాల్లో పశువైద్య కేంద్రాలున్నాయి. 12 పాల కేంద్రాల ద్వారా నిత్యం రైతులు సుమారు రెండువేల లీటర్ల పాలు పోస్తున్నారు. పాల కేంద్రాల ఆధ్వర్యంలో పశువులకు దాణా ఇతరత్రా మందులు అందిస్తూ పశువుల కొనుగోళ్లకు రుణాలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా పశువులను చెట్ల కింద, రేకుల కింద కట్టేయడం మూలంగా దొమ్మ, వడదెబ్బ వంటి రోగాలకు గురవుతున్నాయి. ఇదే క్రమంలో వైద్యమందక చాలా పశువులు చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయని రైతులు తెలిపారు. పశువులను వ్యవసాయ బావి దగ్గర ఉన్న కొట్టాల వద్ద కట్టేయడం మూలంగా హైనాలు దాడిలో చనిపోతున్నాయి. ఇప్పటికైనా ఉపాధిహామీ అధికారులు స్పందించి పశువులకు షెడ్లు నిర్మించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### పశువుల షెడ్లు మంజూరు చేయాలి



పశువులకు షెడ్డు లేక చెట్ల కిందనే కట్టేస్తున్నా. ఉపాధిహామీ పథకంలో షెడ్డు నిర్మాణానికి ఆదుకుంటున్నట్లు మాకు తెలియదు. ఉపాధిహామీ అధికారులు గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు సంక్షేమ పథకాలపై సమాచారం అందించాలి. ప్రభుత్వ పథకాలు సద్వినియోగమయ్యేలా చూడాలి.

- బొల్లం జయ్‌రాజ్, లక్ష్మపల్లి, రైతు

### బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా చూడాలి



దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు ఇవ్వాలి. షెడ్డు నిర్మించుకునే రైతులకు బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా చూడాలి. ఉపాధిహామీలో పశువుల షెడ్లు అందించడం పాడి రైతులకు సంతోషకరమైన విషయం.

- బొల్లం వినయ్ లక్ష్మపల్లి, రైతు

### గ్రామపంచాయతీ సెక్రటరీకి దరఖాస్తు చేసుకోవాలి



పశువుల, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం దార్లు షెడ్ల నిర్మాణాల కోసం గ్రామపంచాయతీ సెక్రటరీకి దరఖాస్తు చేసుకోవాలి. పశువైద్యాధికారిచే మూగ జీవాలున్నాయా లేవా అని పరిశీలించి అందించిన ధ్రువీకరణ పత్రాన్ని ఈజీఎస్ కార్యాలయంలో అందించాలి. నిబంధనల మేరకు పశువుల షెడ్డుకు కనీసం 3 పశువులు ఉండాలి. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.90 వేలు, గొర్రెలు, మేకల షెడ్డుకు కనీసం 20 గొర్రెలు, మేకలు ఉండాలి. ఒక్కో షెడ్డుకు రూ.1.05 లక్షలు, కోళ్ల పెంపకానికి కనీసం 100 కోళ్లు ఉండాలి. ఒక్కో షెడ్డుకు రూ.55 వేలు అందిస్తున్నారు. షెడ్డు నిర్మాణం చేసుకున్న వారికి వెంటనే బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- పరశురాములు, ఉపాధిహామీ ఈసీ

## వైద్యానికి డబ్బుల్లేక.. యువకుడి ఆత్మహత్య



నాగరాజు మృతదేహం

మనోహరాబాద్, మే 20: వైద్యానికి డబ్బుల్లేక మనోవేదనకు గురైన యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం పాలాట గ్రామానికి చెందిన మంచే నాగరాజు(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో కాడ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో ఈనెల 6న చేరాడు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. ఆర్థిక స్థోమత లేక నాగరాజును కుటుంబసభ్యులు శనివారం గ్రామానికి తీసుకొచ్చారు. ఆరోగ్యం పట్ల మనోవేదనకు గురైన నాగరాజు ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శబ్దం రావడంతో కుటుంబసభ్యులు లేచి చూసి ఇతరుల సహాయంతో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉరేసుకుని వ్యక్తి...



నర్సయ్య(ఫైల్)

రాయపోల్, మే 20: పశువుల పాకలో ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోల్‌లో చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, ఎస్‌ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన తుడుం నర్సయ్య(60) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. దీనికితోడు ముక్కులో నుంచి రక్తం కారుతుండేది. కడుపు నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యయడు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున లేచి వెళ్లిన ఆయన పశువుల పాకలో ఉరేసుకుని మృతిచెందాడు. కడుపునొప్పి బాధ భరించలేక తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని కుమారుడు అశోక్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పురుగుల మందు తాగి ఒకరు..



అబ్బదాసరి పోచయ్య(ఫైల్)

మనోహరాబాద్, మే 20: మద్యానికి బానిసైన యువకుడు పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన అబ్బదాసరి పోచయ్య(55) శనివారం సాయత్రం మద్యం సేవించి ఇంటికి రాగా.. కుమారుడు స్వామి, తల్లి రేఖ మద్యం ఎందుకు తాగుతున్నావని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు లేచిచూడగా వాంతులు చేసుకోవడంతో వెంటనే తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సోమవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బీమా డబ్బుల కోసం చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు

- న్యాయం చేయాలని.. ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



ఎస్పీ బాలస్వామికి తన గోడును వినిపిస్తున్న బాధితుడు రాజు

మెదక్ అర్బన్, మే 20: బీమా డబ్బుల కోసం భార్య, కొడుకు కలిసి చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని బాధితుడు చల్లా రాజు ఎస్పీ బాలస్వామికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఔరగంబాద్‌కు చెందిన చల్లారాజు అనార్యోగంతో ఉన్నానని, నన్ను రూ.5 లక్షల భీమా డబ్బుల కోసం భార్య, చిన్న కొడుకు చంపేస్తామని బెదిరిస్తున్నారని, వారికి కౌన్సిలింగ్ లేదా, వారిపై చట్ట పర్యమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. బాధితుడికి న్యాయం చేయాలని హవేళీఘణపూర్ ఎస్‌ఐకి ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు.

## మధ్యప్రదేశ్‌కి చెందిన వివాహిత అదృశ్యం

కుకునూరుపల్లి, మే 20: మధ్యప్రదేశ్‌కు చెందిన వివాహిత అదృశ్యమైన ఘటన మెదినిపూర్‌లో చోటుచేసుకున్నది. కుకునూరుపల్లి పోలీసులు తెలిపిన వివరాల.. మధ్యప్రదేశ్‌కు చెందిన బులియా సలాంకి ఐదు సంవత్సరాల క్రితం బులియా పింకీ అనే మహిళతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. వారు మెదినిపూర్ శివారులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి కుటుంబసభ్యులందరూ భోజనం చేసి పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం 4 గంటల సమయంలో భర్త బులియ సలాం నిద్రలేచి చూడగా, భార్య బులియా పింకీ కనబడలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. భర్త బులియా సలాం మధ్యప్రదేశ్‌కి వెళ్లి వాకబు చేయగా అక్కడా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో తిరిగి వచ్చి సోమవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆర్టీసీ.. స్టాపుల్లో ఆపరేంటీ..?

- నారాయణఖేడ్ డీఎంకు ఫిర్యాదు

అల్లాదుర్గం, మే 20: మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌలభ్యం కల్పించడంతో కొందరు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రయాణికుల రద్దీతో పలు స్టేజీల వద్ద బస్సు నిలపకపోవడం, మరికొందరు సీట్లు ఖాళీగా ఉన్నా.. ఆపకపోవడంతో అల్లాదుర్గంలోని పలు గ్రామాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లాదుర్గం, అల్లాదుర్గం ఐబీ చౌరస్తా, చిల్వర్, ముస్లాపూర్, గడిపెద్దాపూర్ తదితర గ్రామాల్లో బస్సులు ఆపకపోవడంపై ప్రయాణికులు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా.. బస్సులు ఆపని డ్రైవర్లు, కండక్టర్లపై చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో 161వ జాతీయ రహదారి ఏర్పాటు కావడంతో మండలంలోని ఆయా గ్రామాల బస్ స్టేజీలు సర్వీస్ రోడ్డులో ఉన్నాయి. దీంతో కొన్ని బస్సులు సర్వీస్ రోడ్డుపై వెళ్లకుండా జాతీయ రహదారిపై వెళ్తున్నాయి. మరికొన్ని బస్సులు స్టేజీల వద్ద ఆపకపోవడంతో సోమవారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజరుకు ఫిర్యాదు చేశారు. అల్లాదుర్గం మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సులు ప్రయాణికుల రద్దీతో వెళ్లగా... నారాయణఖేడ్ డిపోకు చెందిన లింగంపల్లి బస్సు ఐబీ చౌరస్తా, చిల్వర్ గ్రామాల బస్ స్టేజీల వద్ద నిలపకపోవడంతో ఈ బస్సును బైక్‌పై వెంబడించిన ప్రయాణికులు సమీపంలోని బొడ్మట్‌పల్లి వెళ్లి బస్సు డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. దీంతో తాము రిక్వెస్ట్ స్టాప్‌ల వద్ద ఆపబోమంటూ దురుసుగా బదులిచ్చారు. ఈ బస్సులో ప్రయాణికులు తక్కువగా ఉన్నారు కదా.. అని ప్రశ్నిస్తే.. అది మా ఇష్టమంటూ బస్సును కదిలించారని తెలిపారు. ఈ విషయమై నారాయణఖేడ్ డిపో మేనేజరుకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా కండక్టర్, డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఫిర్యాదులు చేస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రయాణికులు దుమ్మెత్తి పోస్తున్నారు.

# ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్..!

హెచ్‌పీ పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్లక్ష్యం




పెట్రోల్ బంకు నిర్వాహకులతో గొడవ పడుతున్న రైతు

చిన్నశంకరంపేట, మే 20: పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్లక్ష్యంతో ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు పెట్రోల్ పోశారు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు మెదక్-చేగుంట రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పెద్దంకి రాజు తన ట్రాక్టర్‌లో డీజిల్ పోయించుకోవడానికి వచ్చాడు. రూ.960 డీజిల్ పోయాలని బంకు ఆపరేటర్‌కు సూచించాడు. అయితే నిర్వాహకుల నిర్లక్ష్య ధోరణితో డీజిల్‌కు బదులు పెట్రోల్ పోస్తుండగా.. గమనించిన ట్రాక్టర్ యజమాని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాను డీజిలే పోస్తున్నానని బదులివ్వడంతో రాజు ఆందోళనకు దిగాడు. సమాచారమందుకున్న పోలీసులు పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని సముదాయించారు. ట్రాక్టర్ చెడిపోతే బాగు చేయిస్తానని బంకు యజమానికి తెలపడంతో సదరు ట్రాక్టర్ యజమానికి శాంతించాడు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



పన్నేల అశోక్(ఫైల్)

కల్హేర్, మే 20: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని నాగ్‌ధర్ గ్రామానికి చెందిన పన్నేల అశోక్(26) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్రగాయాలైన అశోక్‌ను స్థానికులు నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. మృతిచెందాడు. అశోక్‌కు ఇటీవల ఆపరేషన్ జరిగింది. ఆ నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని కొందరు, తల్లి మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మరికొందరు అనుకుంటున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

## దొంగతనం నేరం మోపారని యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్

చేగుంట, మే 20: ఇంట్లో డబ్బులు దొంగతనం చేశావంటూ నేరం మోపడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చేగుంటలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ బాలరాజ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన కిచ్చుగారి శ్రీకాంత్(26).. అదే గ్రామానికి చెందిన మంద ప్రవీణ్ ఇంట్లో దొంగతనానికి పాల్పడి రూ.18 వేలు ఎత్తుకెళ్లాడని అనుమానం ఉన్నది. ఈ క్రమంలో ప్రవీణ్ శ్రీకాంత్‌ను కొన్నిరోజులుగా వేధిస్తూ ఉన్నాడు. కాగా శనివారం శ్రీకాంత్‌పై ప్రవీణ్ దాడిచేయడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు తల్లితో కలిసి వెళ్తున్నాడు. మార్గమధ్యలో, పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ప్రవీణ్ మళ్లీ శ్రీకాంత్‌ను తిట్టడంతో మనస్తాపానికి గురై.. తన జేబులో ఉన్న అగ్గిపెట్టెతో అంటిపెట్టుకున్నాడు. దీంతో షర్ట్ పూర్తిగా కాలి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం నార్సింగి ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

# వైభవంగా నృసింహ జయంతి



బ్రహ్మోత్సవాల సందర్భంగా ముస్తాబైన ఆలయ ప్రాంగణం



వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో కొలువైన రుక్మిణీసత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారు



నాచగిరి క్షేత్రంలో యాగశాలలో ఆసీనులైన దేవతామూర్తులు

వర్గల్, మే 20: సిద్దిపేట జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో నృసింహ జయంతి వైభవంగా జరుగుతోంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ వేదపండితులు వేద మంత్రోశ్చరణల మధ్య యాగశాలలో యాగశాల ప్రవేశం, మూర్తి కుంభస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూల మంత్ర హవనములు, పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే క్షేత్రంలోని ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. వేడుకలను తిలకించడానికి భక్తులు క్షేత్రానికి వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నాచగిరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యమైనాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో వేడుకలు జరుగుతున్నాయి.

### నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

వర్గల్ మండల కేంద్రంలోని 800 ఏళ్ల చరిత్ర కలిగిన వేణుగోపాలస్వామి ఆలయం ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాలను రంగులతో మెరుగులుదిద్దారు. ఆలయం చుట్టూ మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు అలంకరింపజేశారు. ఆలయం చుట్టూ మిరుమిట్లు గొలిపే విద్యుదీపాలను ఏర్పాటు చేశారు. 21న సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ వేదపండితుడు వేదాంతం మురళీధరచార్యులు తెలిపారు. 22న ధ్వజారోహణం, గరుడ కల్యాణం, 23న ఉదయం 108 లీటర్ల ఆవుపాలతో సహస్ర దారాభిషేకం, సాయంత్రం స్వామివారికి ఎదురుకోళ్ల ఉత్సవం, ఆశ్వవాహణ సేవ, రాత్రి 10.00 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణం ఉంటుంది. 24న గరుడ వాహనోత్సవ సేవ, 25న గజ వావహనోత్సవ సేవ, 26న హనుమత్ వాహనోత్సవ సేవ, 27న శేష వాహనోత్సవ సేవ, 28న పొన్న సేవ, 30న బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలక ఘట్టమైన స్వామివారి విమాన రథోత్సవం, 31 శుక్రవారం శత ఘటాభిషేకం, చక్ర తీర్థం, వసంతోత్సవం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణం, స్వామివారి విమాణ రథోత్సవానికి భక్తులు వేల సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఆలయం వద్ద ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

### ఘనంగా రంగనాయకస్వామి కల్యాణోత్సవం

కొల్చారం, మే 20: మండల పరిధిలోని రంగంపేటలో రంగనాయకస్వామి కల్యాణోత్సవం సోమవారం జరిగింది. రంగంపేటలోని రంగనాయకస్వామి ఆలయానికి సుమారుగా 98 ఎకరాల దేవుని మాన్యం భూములున్నాయి. ఈ భూములను రంగంపేట గ్రామ అగ్రహారం అయిన సదాశినగరం గ్రామస్థులు కాస్తు చేసుకుంటూ స్వామివారికి అన్నిరకాల సేవలు అందించాల్సి ఉంటుంది. రంగంపేట గ్రామం ఆరంభంలోనే ఉన్న గడికోట వద్ద ఉన్న ఈ ఆలయం శిథిలమైనా మరమ్మతుల పేరిట కొద్దిరోజుల కింద నామమాత్రంగా పనులు చేశారు. ఈ సంవత్సరం జరగాల్సిన రంగనాయకస్వామి 688వ పంచాహ్నిక ఉత్సవాల్లో భాగంగా చేస్తున్న కార్యక్రమాలను ప్రాధాన్యత ఇవ్వకుండా నామమాత్రంగా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

### తుర్కపల్లిలో అట్టహాసంగా కుస్తీ పోటీలు

నారాయణఖేడ్, మే 20: ఖేడ్ మండలం తుర్కపల్లి భూలక్ష్మమ్మ జారర సందర్భంగా సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక మల్లయోధులే కాకుండాదూర ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాచిబండ్ల ప్రదర్శన, అన్నదానం నిర్వహించారు. కాగా శివశక్తి సంస్థ ప్రతినిధులు 200 భగవద్గీత పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు.



కొల్చారం మండలం రంగంపేటలో రంగనాయకస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు



నారాయణఖేడ్ తుర్కపల్లిలో భూలక్ష్మమ్మ జాతర సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నదృశ్యం

## కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి క్రైం, మే 20: అసంఘటిత రంగ కార్మికులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని భారతీయ మజ్దూర్ సంఘ్ భవన కార్యాలయంలో సోమవారం అసంఘటిత రంగ కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలు లబ్ధి పొందేందుకు కావాల్సిన కనీస అర్హతల గురించి వివరించారు. 18నుంచి 60 సంవత్సరాల లోపు నిర్మాణ కార్మికులు ఈ చట్టం కింద నమోదు చేసుకోవచ్చన్నారు. కార్మికులకు వివాహ బహుమతి పథకం, ప్రసూతి పథకం, ప్రాణాంతక ప్రమాదాల లబ్ధి పథకం, ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక సహాయాన్ని అందించే పథకం, సాధారణంగా మరణిస్తే లబ్ధి, దహనసంస్కారాల ఖర్చుల చెల్లింపు, వృత్తి నైపుణ్యం, వారసులకు వృత్తి శిక్షణ, జాతీయ పింఛన్ తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ యాదయ్య, భవననిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## మోడల్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



రమేష్, ప్రిన్సిపాల్

నాగల్‌గిద్ద, మే 20: మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు గాను ఒక్కో గ్రూపులో 40 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# అవసరం లేని చోట గోదాములెందుకు?

● గుమ్మడిదల మండలంలో పంట నిల్వలకు గోదాములు లేక ఇక్కట్లు ● పారిశ్రామికవాడలో ఎందుకు నిర్మించారని ప్రశ్నిస్తున్న రైతులు

గుమ్మడిదల, మే 20: మండలంలో గోదాంల సౌకర్యం లేక పంటలకు డిమాండ్ లేని పరిస్థితుల్లోనూ వచ్చిన ధరకే తెగనమ్ముకునే దుస్థితి నెలకొందని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడంతో ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయి. వర్షం వస్తే చాలీచాలని టార్పాలిన్లతో ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలకు ధాన్యం తడిసిపోగా, నిర్ణీత తేమ శాతం వచ్చేవరకు ఎండబెట్టి బస్తాలలో నింపామని రైతులు చెప్పారు. మళ్లీ వర్షం పడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.



గుమ్మడిదలలో ఆరు బయట నిలువ వేసిన వరి ధాన్యం

### గిడ్డంగుల ఏర్పాటులో నిర్లక్ష్యం

మండలంలోని రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ కూరగాయలతో పాటు వాణిజ్య పంటల సాగులో ముందుంటారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ రైతులుగా అవార్డులు అందుకున్న సందర్భాలు సైతం ఉన్నాయి. అయితే అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పండించిన పంట నిలువ చేసుకునేందుకు గిడ్డంగులు లేక ఇబ్బందులు పడుతున్నారు. సాగుకు లక్షల్లో పెట్టుబడి పెట్టినా ఎంతకైతే అంతే ధరకు తెగనమ్ముకుంటున్నారు. దీంతో ఆశించిన గిట్టుబాటు ధర లభించడంలేదు. గుమ్మడిదల మండలం పరిధిలోని కొత్తపల్లి, నల్లవల్లి, మంబాపూర్, కానుకుంట, వీరారెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడెం, అనంతారం, రాంరెడ్డి బావి, దోమడుగు, అన్నారం గ్రామాల్లో వరితోపాటు కూరగాయలు, ఉల్లి వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తుంటారు. ఆయా పంటల ధరలు తరచుగా ఆటుపోట్లకు గురవుతుంటాయి. ధరలు లేనప్పుడు నిల్వ చేసుకొని డిమాండ్ ఉన్నప్పుడు విక్రయించుకోవడానికి స్థానికంగా గోదాములు కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేవు. దీంతో ధాన్యం ఉల్లిగడ్డ తదితర పంట పొలాల వద్ద గ్రామీణ రోడ్ల పైన నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదివర్షాలకు పంట తడిసి నష్టపోతున్నారు.

### ప్రభుత్వ భూములు ఉన్నా..

మండలంలోని 109 సర్వే నెంబర్‌లో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నా రైతులకు అందుబాటులో గిడ్డంగులు నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వాలు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గిడ్డంగులు నిర్మించాలని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. సమీపంలోని ప్రభుత్వ భూములు సర్వే చేసి 20ఎకరాల్లో పూర్తిస్థాయిలో గిడ్డంగులు నిర్మించి కల్లాలు ఏర్పాటు చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్థానిక రైతులు అంటున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైన గిడ్డంగులు, కోల్డ్‌స్టోరేజ్‌లు, కల్లాలు ఏర్పడతాయని ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

### పారిశ్రామిక వాడలో ఎందుకు?

పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎక్కువ పారిశ్రామికవాడలు ఉన్నాయి. గుమ్మడిదల మండలం మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి ఉన్నది. అయితే వ్యవసాయాధారిత మండలంలో కాకుండా పారిశ్రామిక వాడలోని మండలాల్లో గోదాములు నిర్మించారు. దీంతో ఈ గోదాములు వ్యాపారులకు, ప్రైవేట్ వ్యక్తులకే ఉపయోగపడుతున్నాయని రైతులు వాపోతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మండలంలో గిడ్డంగులు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు వేడుకుంటున్నారు.

### గిడ్డంగులు లేక ఇక్కట్లు



మండలంలో సాగు చేస్తున్న పంటలు నిలువ చేసుకునేందుకు గిడ్డంగులు లేక ఇబ్బందులు పడుతున్నాం. పంటను పొలాల వద్ద నిలువ చేసుకుంటే వర్షాలు కురిసి తడిసిపోతున్నది. ప్రభుత్వం స్పందించి గోదాంలు నిర్మించాలి.

\- సదానందరెడ్డి, రైతు, గుమ్మడిదల

### ప్రభుత్వ భూములు ఉన్నాయ్..



మండలంలోని 109 సర్వే నెంబర్‌లో గోదాం కోసం కావలసిన ప్రభుత్వ భూమి ఉన్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఈ ప్రాంతంలో గోదాం నిర్మించి రైతుల కష్టాలు తొలగించాలి. వెంటనే సర్వే చేసి గోదాంలను నిర్మించాలి

\- మద్దుల బాల్ రెడ్డి, జిల్లా రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు

### గిడ్డంగులు ఏర్పాటుకు సుముఖం



మండలంలోని అన్ని గ్రామాలు వ్యవసాయంపై ఆధారపడినవే. రైతుల సౌకర్యం కోసం మండల కేంద్రంలో గిడ్డంగులు నిర్మించాలని డిమాండ్ ఉంది. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయాం. ఇక్కడ గిడ్డంగులు ఏర్పాటుకు ఎమ్మెల్యే సుముఖంగానే ఉన్నారు.

\- కుమార్‌గౌడ్, జడ్పీటీసీ, గుమ్మడిదల

## దాబాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



రాజబోయిన రవి, సీఐ

జహీరాబాద్, మే 20: జహీరాబాద్ సర్కిల్ పరిధిలో దాబాల నిర్వాహకులు సమయపాలన పాటించాలని, అర్ధరాత్రి వరకు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దాబాలను రాత్రి 11.30 గంటల వరకే మాత్రమే తెరిచి ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా వాహనదారులు అన్నిరకాల పత్రాలను దగ్గరే పెటుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని సూచించారు. పట్టణంలో వాహనాల పార్కింగ్ కేటాయించిన స్థలంలోనే చేయాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రమాదాల నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## పోలీసుశాఖ పరంగా బెనిఫిట్స్‌ను అందజేస్తాం



కానిస్టేబుల్ కుటుంబానికి బీమాచెక్కు అందజేస్తున్న ఎస్పీ, ఎస్‌బీఐ మేనేజర్

తూప్రాన్, మే 20: ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి శాఖ పరంగా దక్కాల్సిన బెనిఫిట్స్ అందజేయనున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం పరికిబండ వద్ద జరిగిన ప్రమాదంలో ముప్పిరెడ్డిపల్లికి చెందిన శివ్వంపేట పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ సింగి లక్ష్మారెడ్డి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. తూప్రాన్ ఎస్‌బీఐ ఖాతాలో ఉద్యోగి ఓరియంటల్ బీమా కంపెనీ రూ. 30 లక్షల బీమా సొమ్ము మంజూరు చేసింది. సోమవారం ఎస్పీ డాక్టర్ బాలస్వామి తూప్రాన్ ఎస్‌బీఐ మేనేజర్ శోభన్‌బాబుతో కలిసి రూ.30 లక్షల బీమా చెక్కును కానిస్టేబుల్ భార్య సింగి భవానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు అవయవ దానం చేయడానికి ముందుకు రావడంతో వారి ఔదార్యాన్ని కొనియాడారు. లక్ష్మారెడ్డి ఉత్తమ కోర్టు కానిస్టేబుల్‌గా ఉన్నతాధికారుల మన్ననలు పొంది, ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నాడని కొనియాడారు. అడిషనల్ ఎస్పీ మహేందర్, ఏవో లక్ష్మీలావణ్యలత పాల్గొన్నారు.

## పెయింటింగ్ ఆర్టిస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఆంజనేయులు



సూర్యాపేటలో ఆంజనేయులును సన్మానిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

శివ్వంపేట, మే 20: తెలంగాణ రాష్ట్ర వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ కమిటీ మెంబర్‌గా శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కల గ్రామానికి చెందిన దుద్దేటి ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సూర్యాపేట జిల్లాలో వాల్ పెయింటింగ్ ఆర్టిస్టు అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించగా రాష్ట్ర కమిటీ మెంబర్‌గా ఆంజనేయులుకు అవకాశం దక్కింది. ఈ మేరకు నూతన రాష్ట్ర అధ్యక్షులు గాజుల రాము, ఉపాధ్యక్షులు మంద శివ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ



దొంతి ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాలతో విద్యార్థులు

శివ్వంపేట, మే 20: మండలంలోని దొంతి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీలో ఉత్తీర్ణులైన 52 మంది విద్యార్థులకు సోమవారం హెచ్‌ఎం చావ రవి మెమో, టీసీ, బోనఫైడ్ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి గౌరీ శంకర్, జూనియర్ సహాయకులు వి మల్లేశం, సిఆర్పి హీరాసింగ్, సిబ్బంది రాములు, రేణుక, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో ఘనంగా కాశీ విశ్వనాథుడి రథోత్సవం

దుబ్బాక, మే 20: దుబ్బాక పట్టణంలో ఏటా నిర్వహించే కాశీవిశ్వనాథస్వామి వైశాఖ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవానికి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. శివనామస్మరణతో వీధులు మార్మోగాయి. ఉదయం భద్రకాళి పూజ, అగ్నిగుండాలు తొక్కుట, రథపూజలు, సాయంత్రం ఆశీర్వచనం, తీర్థప్రసాదం, సహస్రానామార్చనలు, శివభజనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### బీరప్ప-కామరాతి కల్యాణం

గజ్వేల్, మే 20: గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో నిర్వహించిన బీరప్ప-కామరాతి కల్యాణానికి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బీరప్పా-కామరతిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జడ్పీటీసీ పంగ మల్లేశం, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు మద్ది రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందం, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజాం, సత్యాగౌడ్, శ్రీను, రాములు ఉన్నారు.

### మహా అన్నదానం

చేర్యాల, మే 20: అన్నపూర్ణ, దేవీవాసవీ పరపతిసంఘం ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో హనుమాన్ మాలధారులకు మహాన్నప్రసాద వితరణ చేశారు.



# ధాన్యం తూకంలో జాప్యంపై రైతుల నిరసన



అల్లీపూర్‌లో ధాన్యం తూకం వేయాలని నిరసన తెలుపుతున్న రైతులు

శివ్వంపేట, మే 20: కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యం, లారీల కొరత కారణంగా గత 20 రోజులుగా ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం తూకం వేయకపోవడంతో జాప్యాన్ని నిరసిస్తూ మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో సోమవారం పలువురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు మహేష్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం దగ్గరికి వడ్లను తీసుకువచ్చి దాదాపు 3 వారాలు గడిచినా తూకం వేయకపోవడంతో అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. అకాల వర్షాలతో పాటు లారీలకొరత, సకాలంలో ధాన్యం తూకం వేయకపోవడంతో వడ్ల కుప్పల దగ్గర రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నామని రైతులు తమ గోడును వెల్లగక్కారు. నిరసనలో రైతులు సాయిలు, వెంకటేష్, నర్సింలు, దశరథ, మహేష్ తదితరులు ఉన్నారు

### ధాన్యం వాహనాలతో రైస్‌మిల్ వద్ద బారులు

శివ్వంపేటలోని ఓంసాయి వెంకటరమణ బాయిలర్ రైస్ మిల్లుకు కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకువచ్చిన ధాన్యం వాహనాలను క్యూ లైన్‌లో ఉంచి వారం గడుస్తున్నా ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేయకపోవడంతో రోజుల తరబడి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు సోమవారం పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల్లో ధాన్యాన్ని రోజుల తరబడి వరుసలో పెట్టడంతో వాహనాలను అధికంగా కిరాయి భారం పడుతుందని, అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, మే 20: అకాల వర్షాలతో జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బి.రాజేశ్వర్‌రావుదేశ్‌పాండే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల వరిధాన్యం తడిసిపోయిన కారణంగా యంత్రాంగం వెంటనే సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ఐకేపీ సెంటర్లలో కొనుగోలు చేయాలని, వడ్లలో తేమ శాతం 15,17 కాకుండా 20 శాతంగా కొనుగోలు చేయాలని కోరారు. గత పదేళ్ల నుంచి రైతుల వద్ద నుంచి హమాలీ డబ్బులు తీసుకుంటున్నారని, ప్రభుత్వం అందులో సగం నగదు నేరుగా కానీ, బ్యాంకుల ద్వారా కానీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్నదాతలను ఆదుకోవాలని లేకపోతే రైతుల పక్షాన ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, నాయకులు నాగరాజు, వాసు, విజయ్, మీనాగౌడ్, బిక్షపతి, ప్రభాకర్‌రెడ్డి, విశ్వనాథ్, లింగమూర్తి, దశరథ్ పాల్గొన్నారు.

# అధికారుల అలసత్వంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



చిన్న గొట్టిముక్కలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

శివ్వంపేట, మే 20: పర్యవేక్షణ లోపంతోనే రైతులు తీసుకువచ్చిన ధాన్యంను సకాలంలో తూకం వేయలేకపోతున్నారని ఎంపీపీ హరికృష్ణ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కురిసిన వర్షానికి చిన్న గొట్టిముక్కల ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని సోమవారం ఎంపీపీ హరికృష్ణ పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... లారీల కొరతతో గోనె సంచుల కొరత ఏర్పడి కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం తూకం వేయడం లేదని, అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొనుగోలు కేంద్రాలను జిల్లా అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ దశరథ, నాయకులు నారాయణరావు, నరేందర్ ఉన్నారు.

### కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

మండల పరిధిలో తిమ్మాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు నవీన్ గుప్తా, ఏపీఎం వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నవీన్ గుప్తా వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని అధికారులను సూచించారు.

## నెలాఖరులోగా ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి: ఇన్‌చార్జి ఎంఈవో



కౌడిపల్లిలో గ్రామసంఘాల అధ్యక్షుల సమావేశంలో మాట్లడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో బుచ్చనాయక్

కౌడిపల్లి, మే 20: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని కౌడిపల్లి ఎంఈవో బుచ్చనాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని గ్రామం సంఘం అధ్యక్షులతో ఏపీఎం సంగమేశ్వర్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన ఇన్‌చార్జి ఎంఈవో బుచ్చానాయక్ మాట్లాడుతూ.. మండలంలోని 38 పాఠశాలలకు కరెంటు, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం నుంచి 25శాతం నిధులు విడుదలయ్యాయని తెలిపారు. వీవోల ద్వారా డ్రా చేసిన అనంతరం పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం ఏపీఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లోని సంఘాలను బ్యాంకు లింకేజీ తీసుకున్న అప్పులు, స్త్రీనిధి రికవరీ చేయాలని సూచించారు.కార్యక్రమంలో సీసీలు రమేష్, నాగరాజు, ఉపాధ్యాయుడు బాలకృష్ణ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన నర్సాపూర్ ఎమ్మెల్యే



కొల్చారంలో అనారోగ్యంతో ఉన్న నర్సింహులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం, మే 20: మండల కేంద్రంలో వివిధ అనారోగ్య కారణాలతో అస్వస్థతకు గురైన పలు కుటుంబాలవారిని ఎమ్మెల్యే సునీతారెడ్డి సోమవారం పరామర్శించారు. కొల్చారం సొసైటీ చైర్మన్ నాగూరి మనోహర్‌కు ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఎండుగుల క్రిష్ణ తండ్రి ఎండుగుల సత్యనారాయణ ఇటీవల ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద కోలుకుంటున్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చౌరిగారి నర్సింహులు పక్షవాతంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవలే ఇంటికి వచ్చారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కొల్చారం గ్రామ పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు మహ్మద్ మృతి చెందగా, అతడి కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ ప్రమాద బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఆమె వెంట మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వేమారెడ్డి, కోనాపూర్ సర్పంచ్ రమేష్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరెంటు రాజాగౌడ్, తాజా మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## అధికారుల తీరుపై ఆర్డీవోకు ఫిర్యాదు

నారాయణఖేడ్, మే 20: నిజాంపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రెండు నెలలుగా కార్యాలయానికి వెళ్లినా తనకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని నిజాంపేటకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి ఆర్డీవో అశోకచక్రవర్తికి సోమవారం ఫిర్యాదు చేశాడు. కార్యాలయానికి వెళ్లినప్పుడు సిబ్బంది ఉన్న సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, మరోసారి వెళ్లినప్పుడు అందుబాటులో లేకపోవడంతో తనకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొన్నదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైన అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకొని త్వరగా సర్టిఫికెట్లు జారీ చేసేలా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

## 'జొన్న రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు'

కల్హేర్, మే 20: మండల పరిధిలోని కల్హేర్, మార్డి, క్రిష్ణాపూర్ గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, యాసంగిలో పండించిన జొన్నలను పూర్తిగా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి హామీ ఇచ్చినట్లు సీడీసీ మాజీ చైర్మన్ ఎన్నం నర్సింహారెడ్డి, కల్హేర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్లు ఎం. వీర్ శెట్టి, మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుకారాం, జితేందర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలు తీసుకోవాలని నిర్ణయించిందని, దీంతో జొన్న రైతులకు ప్రయోజనం చేకూరనున్నట్లు తెలిపారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకే కేంద్రాల ఏర్పాటులో కొంత జాప్యం జరిగిందన్నారు. అయినప్పటికీ ప్రతీ రైతు పండించిన జొన్నలు పూర్తిగా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# మురుగునీటితో కంపు కొడుతున్న వరదకాల్వలు

● దాబాల నుంచి నాలాల్లోకి మురుగునీటి విడుదల ● కలుషితమవుతున్న చెరువులు ● పట్టించుకోని అధికారులు



కందిలోని జాతీయ రహదారి పక్కనే వరద కాల్వలో కలుషిత నీరు

కంది, మే 20: కంది మండల పరిధిలోని దాబాల యాజమాన్యాల తీరుతో వరద, కట్టు కాల్వలు మురుగు కూపంలా తయారయ్యాయి. దాబాల్లో వ్యర్థ ఆహార పదార్థాలతో పాటు మురుగునీరు అంతా సంగారెడ్డి, కందిలోని చెరువుల్లోకి ప్రవహించే నాలాల్లోకి వదులుతున్నారు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంది శివారులోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ దాబా యజమాని వరదకాల్వలోకి తమ దాబాకు సంబంధించిన మురుగునీటిని, వ్యర్థాలను వదిలేందుకు ఏకంగా పైప్‌లైన్ వేశాడు. దీంతో వరదకాల్వ మొత్తం మురుగునీటితో నిండిపోయింది. కాలువ మొత్తం వ్యర్థ జలాలతో కంపుకొడుతున్నది. మరి కొందరు దాబాల యజమానులు కట్టు కాల్వలలోకి యథేచ్ఛగా మురుగునీటిని వదులుతూ చెరువులను కలుషితం చేస్తున్నారు. అడ్డగోలుగా చేరే మురుగునీటితో పంట కాల్వలు సైతం కలుషితమయ్యాయి. సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు, కందిలోని పెద్ద చెరువులు కూడా మురుగునీటి ప్రవాహంతో కలుషితమై జీవవైవిధ్యానికి పెనుముప్పుగా మారాయి. మురుగునీటి వల్ల పరిసరాలు భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై సోమవారం కంది ఇరిగేషన్ ఏఈ మజారుద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వరద, కట్టు కాల్వలను వెంటనే పూడిక తీయిస్తానని, వరదకాల్వలోకి అక్రమంగా వేసిన పైప్‌లైన్‌లను తొలగిస్తామన్నారు. చెరువుల్లోకి ప్రవహించే కాల్వలను కలుషితం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



కంది శివారులో కట్టు కాల్వలో దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీరు

## పైప్‌లైన్ వాల్వు వద్ద మురికి నీటిని తొలగించండి



వాల్వు చుట్టూ నిలిచిన మురికి నీరు

కంగ్టి, మే 20: మండల పరిధిలోని భీంరాలోని ఎస్సీకాలనీలో తాగునీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్ వాల్వు చుట్టూ మురికి నీరు నిలిచి అపరిశుభ్రంగా మారిందని, కాలనీవాసులు ఆందోలన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన వాల్వు గుండా మురికి నీరు తాగునీటిలో కలిసే ప్రమాదం ఉందన్నారు. కాలనీవాసులంతా ఈ పైప్‌లైన్ ద్వారా వచ్చే నీటినే తాగుతున్నట్టు తెలిపారు. ఎస్సీ కాలనీ కావడంతోనే ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీటిని తాగి ప్రజలు రోగాల భారిన పడితే ఎవరూ బాధ్యులని ప్రశ్నించారు. అధికారులు స్పందించి తక్షణమే వాల్వు చుట్టూ చేరిన మురికి నీటిని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.